క్లుప్తంగా

పుల్వామా అమరవీరులకు నివాళి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డా.రమేష్

హిందూపురం అర్బన్: పుల్వామా దాడిలో వీర మరణం పొందిన 40 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లకు బీఐటీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు శుక్రవారం నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ డా.ఎ.రమేష్ మాట్లాడుతూ ఆనాటి ఘోరమైన దాడి దేశాన్ని కదిలించిందన్నారు. మన సైనికుల త్యాగం ఎప్పటికీ మరువలేనిదన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి



సమస్యలను తెలియజేస్తున్న ఎంపీటీసీలు

పెనుకొండ రూరల్: ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని సభ్యులు అధికారులను కోరారు. శుక్రవారం ఎంపీపీ గీత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఏఓ చందన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రైతులకు సంక్షేమ పథకాలు అందాలంటే ప్రతి రైతూ యూనిక్ నంబర్‌ను తప్పక పొందాలన్నారు. మండలంలో ఐదుగురు సభ్యులను గ్రూప్‌గా ఏర్పాటు చేసి, రూ.10 లక్షల విలువైన డ్రోన్‌ను 80శాతం సబ్సిడీతో ఇవ్వనున్నట్లు తెలిపారు. నాగలూరు, శెట్టిపల్లి, మావటూరు, గుట్టూరు ఎంపీటీసీలు శివయ్య, నిర్మల, రత్నమ్మ మాట్లాడుతూ తమ పంచాయతీల్లో తాగునీటి సమస్య తీర్చాలని, సీసీ రోడ్లు నిర్మించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. 15వ ఆర్థిక సంఘం నిధులు ఒక్కో పంచాయతీకి ఎంపీటీసీకి రూ.2 లక్షలు కేటాయిస్తూ సమావేశంలో తీర్మానించారు.

బీసీ బాలుర హాస్టల్ తనిఖీ

అగళి: మండల కేంద్రంలోని బీసీ బాలుర హాస్టల్‌ను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల ప్రత్యేక అధికారి చంద్రశేఖర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు శాతం, రికార్డులను పరిశీలించారు. వంట రూములో సరుకుల నాణ్యతను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని హాస్టల్ వార్డెన్ సికిందర్ బాషాకు సూచించారు.

విశిష్ట సంఖ్యతో ప్రయోజనాలు

రొద్దం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశిష్ట రైతు గుర్తింపు సంఖ్యతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఏఓ నివేదిత అన్నారు. శుక్రవారం రైతు గుర్తింపు సంఖ్య ప్రయోజనాలపై ఆమె రైతులకు అవగాహన కల్పించారు. రైతులందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వివరించారు.

పెనుకొండలో దోపిడీకి యత్నం

పెనుకొండ: పట్టణంలోని నారాయణమ్మ కాలనీలో ఓ ఇంట్లో నిర్వహిస్తున్న బ్యూటీ పార్లర్‌లోకి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి దోపిడీకి యత్నించారు. శుక్రవారం స్థానిక కాలనీలో బ్యూటీపార్లర్ నడుపుతున్న ఇంట్లోకి దుండగులు చొరబడి మహిళను కత్తితో బెదిరించగా, ఆమె గట్టిగా కేకలు వేసింది. స్థానికులు అక్కడికి పరుగున చేరుకోవడంతో దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. దుండగులు కత్తితో పాటు, ఇయర్‌ఫోన్స్ అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

కుర్చీ వెనక్కు పంపాం

పెనుకొండ: సబ్ జైలుకు రూ.8 వేలు కుర్చీ ఇస్తేనే ఖైదీని విడుదల చేస్తామన్నట్లు సోషల్ మీడియాలో ట్రోల్‌చేయడంలో వాస్తవం కాదని సబ్‌జైలు అధికారి షేక్ అజ్గర్ హుస్సేన్ శుక్రవారం తెలిపారు. కొత్తచెరువుకు చెందిన కొందరు వ్యక్తులు సబ్‌జైలుకు కుర్చీ ఇవ్వాలని ప్రయత్నించారని, ఆ సమయంలో తాను ఇంట్లో ఉన్నానన్నారు. అయితే చైర్ తీసుకువస్తున్న విషయం తెలుసుకొని ప్రశ్నించడంతో అసలు విషయం బయట పడిందన్నారు. వెంటనే కుర్చీని వెనక్కు పంపామన్నారు. సోషల్ మీడియాలో కొందరు కావాలనే వీడియో పెట్టడం సరికాదన్నారు.

బర్డ్ ఫ్లూతో జాగ్రత్తగా ఉండాలి



రైతుకు సూచనలిస్తున్న ఏడీఏ అమర్

మడకశిరరూరల్: కోళ్ల ఫారాల నిర్వాహకులు బర్డ్ ఫ్లూతో జాగ్రత్తగా ఉండాలని పశు సంవర్ధక శాఖ ఏడీఏ అమర్ తెలిపారు. శుక్రవారం బుళ్లసముద్రంలో రైతు జయపాల్‌కు చెందిన కోళ్ల ఫారంను సందర్శించారు. బర్డ్ ఫ్లూ లక్షణాలు ఏమైనా ఉన్నాయని అని పరిశీలించారు. ఇప్పటి వరకూ ఏమైనా కోళ్లు మృతి చెందాయా అని ఆరా తీశారు. ఏడీఏ మాట్లాడుతూ.. ప్రస్తుతం బర్డ్ ఫ్లూ లక్షణాలు కనిపించలేదన్నారు. ముందు జాగ్రత్తగా నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఒక వేళ కోళ్లకు వైరస్ సోకితే చికిత్సలు చేయించాలన్నారు. కోళ్లు చనిపోతే బయట ప్రాంతంలో పారవేయకుండా కాల్చి వేయాలని సూచించారు.

పంట మార్పు.. ఆదాయం ఆర్జించు

- పంటల మార్పిడితో అధిక దిగుబడులు
- కూరగాయలు, రాగి, తదితర పంటలపై ఆసక్తి
- ఆర్థికంగా నిలదొక్కుకుంటున్న రైతులు



వక్కతోటలో అంతర పంటగా రాగి సాగు చేసిన దృశ్యం

గుడిబండ: పంటల సాగు విషయంలో రైతుల్లో మార్పు కనిపిస్తోంది. గతంలో ఖరీఫ్ సీజన్‌లో వరి, మొక్కజొన్న, వేరుశనగ సాగు చేసేవారు. మళ్లీ అవే పంటలనే రబీ సీజన్‌లో పండించేవారు. కొన్ని ప్రాంతాల రైతుల అయితే సాగు నీరు లేక పోవడంతో ఖరీఫ్ అనంతరం పొలాలను బీడుగా వదిలేయడం చూశాం. కనీసం అవసరాల పంటలను సాగు చేసే పరిస్థితి కూడా కనిపించేది కాదు. ఫలితంగా భూసారం తగ్గి, ఆశించిన ఫలితాలు వచ్చేవి కావు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన రైతు భరోసా కేంద్రాల ద్వారా గ్రామీణ వ్యవసాయంలో ఎన్నో మార్పులు వచ్చాయి. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు రైతులకు అందుబాటులో ఉండి, పంటల మార్పిడి ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నారు. అగ్రిల్యాబ్‌ల ద్వారా భూసార పరీక్షలు చేసి నేల రకానికి అనుగుణంగా పంటలు వేసే విధానం తెలపడం రైతులకు కలిసొచ్చింది. ప్రస్తుతం గుడిబండ, అమరాపురం, రొళ్ల, అగళి మండలాల్లో పంటల మార్పిడి కనిపిస్తోంది. నియోజకవర్గంలో సాగునీటి వసతి ఉన్న ప్రాంతాల్లో ఎక్కువగా వక్కచెట్లు, రాగి, జొన్న, మొక్కజొన్న, పత్తి పంటలను సాగు చేస్తున్నారు. వక్క తోటలో అంతర పంటలుగా కూరగాయలు, చిరు ధాన్యాలను పండించి అధిక లాభం పొందుతున్నారు. రాగి, మొక్కజొన్న, పత్తి పంట ద్వారా ఎకరా సాగుకు రూ.15 వేల వరకూ ఆదాయం వస్తోందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా ఈ ఏడాది రాగి పంట 1,120 ఎకరాలు, మొక్కజొన్న 1,615 ఎకరాలు, పత్తి 1,265, వక్కతోట 780 ఎకరాల్లో సాగులో ఉంది. రాగి పంట ఎక్కువగా అమరాపురం, గుడిబండ, రొళ్ల, అగళి మండలల్లో పండిస్తారు. ఎకరాలో రాగి సాగుతో రూ.14 వేలు, ఎకరాలో వేరుశనగ సాగుతో ఖర్చులన్నీ పోనూ రూ.16 వేల వరకు ఆదాయం వస్తుందని రైతులు చెబుతున్నారు. పలుచోట్ల కూరగాయల సాగు పంటపొలాల్లో చేపడుతున్నారు. అమరాపురం, గుడిబండ, మడకశిర, అగళి మండలాల్లో టమాట, వంకాయ, ఆకుకూరల సాగు అధికంగా కనిపిస్తోంది. ఇవే కాకుండా క్యాబేజీ, మిర్చి, ముల్లంగి పంటల సాగుకు కూడా రైతులు శ్రీకారం చుట్టారు.

మార్కెట్‌లో రాగికి డిమాండ్



నాకున్న రెండు ఎరాల పొలంలో వక్కతోటలో అంతర పంటగా కర్బూజ, రాగి తదితర పంటలు సాగు చేశాను. ప్రస్తుతం రాగి గింజలు, రాగి పిండికి మంచి డిమాండ్ ఉంది. పంట కూడా నష్టపోకుండా చేతికి వస్తుంది. రాగులు మంచి ధర పలుకుతున్నాయి. పెట్టుబడి పోనూ మంచి ఆదాయం వస్తుంది.

– శ్రీనివాస్, రైతు, ఆలుడి గ్రామం

దిగుబడి పెరుగుతుంది



ఒకే రకమైన పంటను సాగు చేయడం ద్వారా తెగుళ్లు, వ్యాధులు వేగంగా వ్యాపించే అవకాశం ఉంది. పంట మార్పిడి ద్వారా ఈ సమస్యను నివారించడానికి రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. వివిధ రకాల పంటలను పండించడం ద్వారా నేల సారవంతం అవుతుంది. తద్వారా అధిక దిగుబడులు సాధించేందుకు అవకాశం ఉంటుంది.

– వీరనరేష్, ఏఓ, గుడిబండ మండలం

ఆర్టీసీ బస్టాండు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

సాక్షి ఎఫెక్ట్..



ఆర్టీసీ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎం ఇనయతుల్లా

లేపాక్షి: స్థానిక ఆర్టీసీ బస్టాండు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని హిందూపురం ఇన్‌చార్జ్ డీఎం ఇనాయతుల్లా పేర్కొన్నారు. శుక్రవారం ఆకతాయిలకు అడ్డా..బస్టాండు శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఈసందర్భంగా ఆయన బస్టాండుకు చేరుకుని బస్టాండు పరిసరాలు, మరుగుదొడ్లు, నీటి సౌకర్యం, బస్టాండులోకి బస్సులు ఎందుకు రావడంలేదనే దానిపై ఆరా తీశారు. డీఎం బస్టాండులో ఉన్నట్టుగానే హిందూపురం, కొడికొండ చెక్‌పోస్టుల నుంచే బస్సులు రాకపోకలు కొనసాగించాయి. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతు లేపాక్షి ఆలయాన్ని సందర్శించడానికి అనేమంది పర్యాకులు, భక్తులు విచ్చేస్తుంటారని, వీరిని దృష్టిలో వుంచుకుని బస్టాండులో సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఆకతాయిలు బస్టాండులోకి రాకుండా పోలీసులకు సమాచారం అందజేస్తామని తెలిపారు. ఆర్టీసీ బస్సులు బస్టాండులోకి తప్పనిసరిగా వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్టీసీ కంట్రోలర్‌ను కూడా నియమిస్తామని పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన ఆర్టీసీ సిబ్బందికి సూచనలు చేశారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



నివాళులర్పిస్తున్న నాయకులు

గోరంట్ల (సోమందేపల్లి): మండలంలోని కొండ్రెడ్డిపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు వెంకటరామిరెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందారు. మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ భర్త చరణ్ రెడ్డి గ్రామానికి చేరుకొని ఆయన మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వీర నారాయణ రెడ్డి, ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు ఫకృద్దీన్ సాబ్, సీనియర్ నాయకులు రఘురాం రెడ్డి, పోతుల రామ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గోరంట్ల (సోమందేపల్లి): మండలంలోని మందలపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయుడు ఎట్టి నడిపన్న అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందాడు. సర్పంచ్ ప్రమీళ, స్థానిక నాయకులు ముసలిరెడ్డి, నరసింహులు, విజయ్ కుమార్ తదితరులు నడిపన్న మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఘనంగా దామోదరం సంజీవయ్య జయంతి



దామోదరం సంజీవయ్య చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పెనుకొండ రూరల్: స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద దివంగత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య చిత్రపటానికి దళిత ప్రజా సంఘాల నాయకులు శుక్రవారం నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత నాయకులు ఎంఎన్ మూర్తి, రామాంజనేయులు,పెద్దన్న, బీజేపీ రామకృష్ణ, రాము, తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

మడకశిర: పట్టణంలో శుక్రవారం మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలను మాల మహానాడు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాల మహానాడు సంఘం అధ్యక్షుడు సోమకుమార్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కరుణాకర్ కేక్ కట్ చేసి పంచి పెట్టారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన మాల మహానాడు సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రొళ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామరావు, మండల పరిషత్ ఏఓ ప్రసాద్, కార్యదర్శి బాబురావు, ఏపీఓ ఓబుళప్ప, జేఈ మారేగౌడు పాల్గొన్నారు.

వెంకావధూత రథోత్సవం

పావగడ: హుస్సేన్ పురంలో జీవ సమాధి అయిన షిర్డీ సాయిబాబా గురువు వెంకావధూత స్వామి రథోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఏకవార రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, చామరసేవ, వెంకావధూతకు ప్రాకారోత్సవం, రథాంగ హోమం, పూర్ణాహుతి చేపట్టారు. అనంతరం వెంకావధూత స్వామిని రథంలో కొలువుదీర్చి, ఊరేగించారు. ఇదిలా ఉండగా.. వెంకూసా అని పిలిచే వెంకావధూత స్వామి షిర్డీ నుంచి వివిధ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రాలను పర్యటించి పావగడ తాలూకాలోని నాగలమడక హోబళికి చెందిన హుస్సేన్ పురంలో స్థిరపడ్డారు. ఆ గ్రామంలోనే జీవ సమాధి అయినట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

మడకశిరరూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని ముత్తూట్ ఫైనాన్స్ మేనేజర్ లక్ష్మీనారాయణ, సాహితీమహల్ ట్రస్టు సభ్యుడు, వకీలు ప్రతాప్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని గుండుమల బాలుర గురుకుల పాఠశాలలో సాహితీమహల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ముత్తూట్ ఫైనాన్స్ సంస్థ తరపున 1000 లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ప్లాంట్ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఫణీంద్ర సాగర్, సంస్థ మేనేజర్ దినేష్ పాల్గొన్నారు.

అసౌకర్యంగా మావటూరు బస్ షెల్టర్



నిరుపయోగంగా ఉన్న మావటూరు బస్ షెల్టర్

పెనుకొండ రూరల్: ప్రజా సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బస్టాండ్ నిరుపయోగంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే మడకశిర ప్రధాన రహదారిలోని నాగళూరు, మావటూరు పంచాయతీ ప్రజల సౌకర్యార్థం ఇరవై ఏళ్ల క్రితం మావటూరు ప్రధాన రహదారి పక్కన బస్ షెల్టర్ నిర్మించారు. ఇటీవల ఆకతాయిలు బస్ షెల్టర్‌లోని బెంచీ బండలను ధ్వంసం చేశారు. బస్‌సెల్టర్ బయటి పక్కన గోడలు పెచ్చులూడుతున్నాయి. 3వేల జనాభా ఉన్న నాగళూరు పంచాయతీలోని గ్రామాలకు 3 వేల పైబడి జనాభా ఉన్న మావటూరుకు బస్ షెల్టర్ ఒక్కటే ఉంది. ఆటు మడకశిర ఇటు పెనుకొండ పట్టణాలకు వెళ్లాల్సిన బస్ షెల్టర్ వద్దనే ప్రయాణికులు వేచి ఉండాలి. వేసవి సమీపిస్తుండటంతో ప్రయాణికులు, కూర్చునేందుకు వీలుకాక నిలువ నీడలేక ఇబ్బందులు పడుతున్నారు.

ఘనంగా ఆలయ ప్రథమ వార్షికోత్సవం



స్వామి వారిని దర్శించుకున్న దీపిక, వేణురెడ్డి తదితరులు

హిందూపురం అర్బన్ : పట్టణంలోని దండు రోడ్డులో వెలసిన 27 అడుగుల ఆంజేయస్వామి విగ్రహ ప్రథమ వార్షికోత్సవం, కుంభాభిషేకాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వకర్త టీఎన్ దీపిక, నియోజవర్గ నేత వేణురెడ్డి, పార్టీ రాష్ట్ర కురుబ వర్కింగ్ ప్రెసిడెంట్, కౌన్సిలర్ శివ, కౌన్సిలర్ మహేష్‌గౌడ్ స్వామి వారినిక దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, కవితారెడ్డి, శ్రీరాములు, నవీన్, క్రిష్టప్ప, ఆలయ కమిటీ సభ్యులు నారాయణస్వామి, గంగప్ప, రామాంజనేయరెడ్డి, సురేష్, రవి, మూర్తి, లక్ష్మణ్ణ పాల్గొన్నారు.

20 నుంచి వైఎస్సార్ మెమోరియల్ క్రికెట్ టోర్నీ

హిందూపురం అర్బన్: పట్టణంలో ఈ నెల 20 నుంచి వైఎస్సార్ మెమోరియల్ క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్లు టోర్నమెంట్ ఆర్గనైజర్లు షాహిద్, తౌషిత్ తెలిపారు. శుక్రవారం టోర్నీకి హాజరుకావాలంటూ వారు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపికను ఆహ్వానించారు. ఈసందర్భంగా దీపిక టోర్నీ బ్యానర్‌ను ఆవిష్కరించారు. టోర్నీ విన్నర్స్‌కు రూ.30 వేలు, రన్నర్స్‌కు రూ.20 వేలు నగదు బహుమతి ఇవ్వనున్నట్లు ఆర్గనైజర్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గుడ్డం దాదు, ఇన్‌చార్జ్ ఫారుక్, నాయకులు ఇనాయత్, జబ్బీర్, నయాజ్, ఇరాఫన్, అడ్డు, లులు, జునేత్, బాబా, ఆఫ్రీద్ పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలు జయప్రదం చేద్దాం



ఆహ్వాన పత్రికలను విడుదల చేస్తున్న దృశ్యం

లేపాక్షి: లేపాక్షి వీరభద్రస్వామి ఆలయంలో ఈనెల 25 నుంచి మార్చి 1 వరకు జరిగే మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేద్దామని ఆలయ చైర్మన్ కరణం రమానందన్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం ఆలయం ఆవరణలో గ్రామ సర్పంచ్ ఆదినారాయణ అధ్యక్షతన మహాశివరాత్రి ఉత్సవాల ఆహ్వానపత్రికలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపిక

హిందూపురం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థి జే. దుర్గ జాతీయ సమైక్యత శిబిరాని ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం. ప్రగతి తెలిపారు. మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లోని శివాజీ యూనివర్సిటీలో ఈ నెల 16–22 వరకు జరిగే శిబిరంలో ఎస్‌కేయూ ఎన్‌ఎస్‌ఎస్ విభాగం నుంచి పాల్గొంటుందన్నారు. విద్యార్థినిని ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపల్ వెంకటేశులు, అధ్యాపకులు అభినందించారు.

ఆంగ్ల భాషపై పట్టు సాధించాలి

రొళ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం మండల పరిధిలోని హెచ్‌ఎం పల్లి, రొళ్లగొల్లహట్టి తదితర ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఆయా పాఠశాలల్లో రికార్డులు తనిఖీ చేశారు. తర్వాత విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. హెచ్‌ఎం పల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో ఆంగ్ల భాషలో పాఠ్యాంశాలను చదివించారు. మిగిలిన పాఠశాలల్లో కూడా ఉపాధ్యాయులు ఆంగ్ల బోధన విషయంలో శ్రద్ధ తీసుకోవాలన్నారు. మెనూ తప్పనిసరిగా పాటించి రుచికరమైన భోజనం వడ్డించాలని సూచించారు.

హుండీ కానుకల లెక్కింపు

అమరాపురం: హేమావతి గ్రామంలోని సిద్ధేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం హుండీ కానుకలను లెక్కించారు. ఆలయానికి రూ.2,11,979 ఆదాయం వచ్చినట్లు ఈఓ నరసింహమూర్తి, ఉత్సవ కమిటీ చైర్మన్ కరేగౌడ తెలిపారు. ఈ మొత్తాన్ని దేవాలయ బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఘనంగా డోలోత్సవం

అమరాపురం: స్థానిక ప్రసన్న లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్వామికి డోలోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు శ్రీనిధి భట్టాచార్యులు స్వామికి వివిధ రకాల అభిషేకాలు చేపట్టారు. అనంతరం భక్తులు తెచ్చిన వివిధ పూలతో స్వామిని అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. రాత్రి ధ్వజరోహణం, డోలోత్సవం నిర్వహించారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం అందజేశారు.

శ్రీవారికి ఘనంగా చక్రస్నానం



పూజలందుకున్న వేంకటేశ్వరుడు

హిందూపురం అర్బన్: పట్టణంలో పేట వేంకటరమణుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారికి చక్రస్నానం, వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం ధ్వజావరోహణ కార్యక్రమం చేపట్టారు. చక్ర సాన్నం తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. రాత్రి ఉయ్యాలోత్సవం కనులపండువగా సాగింది.

స్టార్టర్ చోరీ

అమరాపురం: గొడనకుంట గ్రామానికి చెందిన రైతులు సిద్ధప్ప, పుట్టలింగప్పకు చెందిన స్టార్టర్లు చోరీకి గురయ్యాయి. రెండు స్టార్టర్లను సుమారు రూ.27 వేలకు కొనుగోలు చేసి వ్యవసాయ తోటలో బోరుబావులకు అమర్చినట్లు రైతులు తెలిపారు. అయితే గుర్తు తెలియని దుండగులు గురువారం రాత్రి చోరీ చేసినట్లు పేర్కొన్నారు. దొంగలను పట్టుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రైతులు తెలిపారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

మడకశిరరూరల్: హరేసముద్రం పంచాయతీలోని గ్రామాల్లో వేసవిలో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా ముందు జాగ్రత్తగా చర్యలు చేపట్టామని సర్పంచ్ కరియన్న తెలిపారు. శుక్రవారం ఉపార్లపల్లి గ్రామంలో తాగునీటి కోసం కొత్త బోరు వేయించగా 2 ఇంచుల నీరు పడినట్లు పేర్కొన్నారు. గ్రామంలో ఇక తాగునీటి సమస్య తీరుతుందన్నారు. పలు చోట్ల దెబ్బతిన్న పైప్‌లైన్లకు మరమ్మతులు చేయించామన్నారు. తాగునీటి పథకాలు, కొళాయిల వద్ద ప్రజలు తాగునీటిని వృథా చేయకూడదని సూచించారు.

ఎన్‌ఎస్‌ఎస్ పీఓగా ప్రతాప్

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారిగా డాక్టర్ ప్రతాప్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ జాతీయ సేవా పథకం కోఆర్డినేటర్ మురళి నుంచి శుక్రవారం ఆదేశాలు జారీ అయ్యాయి.

డ్రిప్ పరికరాల దగ్ధం

రొద్దం: మండలంలోని శ్యాపురం గ్రామానికి చెందిన రైతు రామాంజినాయక్ అనే రైతు పొలంలో నిప్పంటుకొని డ్రిప్ పరికరాలు దగ్ధమయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు ఎండు గడ్డికి నిప్పు పెట్టడంతో తన పొలానికి మంటలు ఎగపాకి డ్రిప్ పరికరాలు కాలి బూడిదైనట్లు వాపోయారు.

కోత విధించిన బియ్యం వెంటనే ఇవ్వాలి

మడకశిర: పేదలకు చౌకధాన్యపు డిపోల ద్వారా అందిస్తున్న బియ్యంలో ఈనెల 25 శాతం కోత విధించడం అన్యాయమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఈనెలలో కోత విధించిన బియ్యాన్ని చౌకధాన్యపు డిపోలకు సరఫరా చేసి పేదలను ఆదుకోవాలని కోరారు. పేదలకు సబ్సిడీతో అందిస్తున్న బియ్యంలో కూడా కోత విధించడం దారుణమని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా పేదలను మోసం చేసిందన్నారు. కంది పప్పు కూడా ఇవ్వడం లేదని ధ్వజమెత్తారు. చౌకధాన్యపు డిపోల ద్వారా కంది పప్పు అందక పేదలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బాలింతలు, చిన్నారులు, గర్భిణులకు పౌష్టికాహారం కింద అందిస్తున్న కందిపప్పు, నూనె ఇవ్వడం లేదని ఆరోపించారు. గత ప్రభుత్వంలో ఇస్తున్న అన్ని సరుకులను సరఫరా చేసి పేదలను ఆదుకోవాలన్నారు.

లేపాక్షి ఆలయంలో విశాల్ ఈశ్వర్

లేపాక్షి: లేపాక్షి వీరభద్రస్వామి ఆలయాన్ని అఖిల భారత పంచాయితీ పరిషత్, రైతు కర్ణాటక ప్రభుత్వం అధ్యక్షుడు విశాల్ ఈశ్వర్ శుక్రవారం ఉదయం సందర్శించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోని దుర్గాదేవి, వీరభద్రస్వాముల వారికి ప్రత్యేక పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ



పూజల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిర: పట్టణంలో శుక్రవారం మూలకంఠేశ్వర దేవి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప హాజరై, ప్రత్యేక పూజలు చేయించారు. వేద పండితులు ఈరలక్కప్పకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కుంచిటి వక్కలిగ విభాగం అధ్యక్షుడు రంగేగౌడ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ కన్వీనర్ పుట్టకామప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు శేషాద్రి, అంజలి, రంగనాథ్, మల్లికార్జున, శివానంద్, గోపి, నగేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి తదితరులు మూలకంఠేశ్వరి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేయించారు. అలాగే పట్టణంలో నూతనంగా నిర్మించిన జామియా మసీదును సందర్శించారు. ఈ సందర్భంగా ముస్లింలు ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రామిరెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ నాయకులు యోగానంద, గోపి, నాగభూషణ్ రెడ్డి, అంజలి, నగేష్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కమనీయం.. రథోత్సవం



రథంలో ఊరేగుతున్న శనీశ్వరుడు

పావగడ: పట్టణంలో జ్యేష్టాదేవి సమేత శనీశ్వర స్వామి రథోత్సవం శుక్రవారం సాయంత్రం వైభవంగా జరిగింది. ప్రత్యేక రథంలోని ముందు భాగంలో శివపార్వతులను కొలువుదీర్చారు. జ్యేష్టాదేవి సమేత శనీశ్వరస్వామిని ప్రధాన మార్గంలో ఊరేగించారు. దారి పొడవునా భక్తులు బారులు దీరి స్వామిని దర్శించుకున్నారు. రథానికి టెంకాయలు కొట్టి పూజలు చేశారు. అంతకు ముందు ఉదయం ఆలయంలో స్వామి వార్లకు సూర్యారాధన, సూర్య ప్రార్థన, ఆవాహిత దేవతారాధన, ఆవాహిత దేవతోద్వాసన, ఆవాహిత దేవతలకు అవభృత స్నాన, ప్రసాద వినియోగ కార్యక్రమాలు నిర్వహించారు.

కంటి చూపుపై జాగ్రత్తలు తీసుకోండి

మడకశిరరూరల్: ప్రతి ఒక్కరూ కంటి చూపుపై జాగ్రత్తలు పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మంజువాణి తెలిపారు. ఇటీవల ఎంజేపీ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు చేశారు. దృష్టి లోపం ఉన్న వారిని గుర్తించారు. శుక్రవారం విద్యార్థినులకు కళ్ల అద్దాలను పంపిణీ చేశారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు శ్రీనివాస్, శృతి, ప్రిన్సిపాల్ హెచ్‌జీబా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.